క్లుప్తంగా

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం

తాళ్లరేవు: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి వేసేందుకు తాగునీటి పైపులైన్ పనులను తాళ్లరేవు పంచాయతీ శివారు శ్రీరంగనాయకపురంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తాళ్లరేవు మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యకు ఈ పనులతో శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ ఆకుల వెంకన్న, రెడ్డి రెడ్డిబాబు, చిట్టూరి చలపతి, అద్దంకి లక్ష్మీనారాయణ, బొంతు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు



వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న కోలాట ప్రదర్శన

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. లక్ష్మీవల్లభ భజన మండలిచే మహిళలు చేస్తున్న కోలాట ప్రదర్శన అటు భక్తి భావాన్ని, ఇటు వినోదాన్ని పంచుతోంది. అలాగే అమలాపురం కళా క్షేత్ర ఆధ్వర్యంలో బాలికలు ప్రదర్శించిన భక్తి గీతాల నృత్య రూపకాలు అందరినీ అలరిస్తున్నాయి. గత నెల 28 నుంచి మొదలైన కల్యాణోత్సవాలు ఈ నెల 7వ తేదీ వరకూ జరుగుతాయి. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి, ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

రూ.10 వేలు పింఛన్ అందజేత



కిడ్నీ వ్యాధిగ్రస్తురాలికి పింఛన్ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవుకు చెందిన బైరెడ్డి పద్మ గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో ఆమెకు కిడ్నీ దయాలసిస్ పింఛన్ రూ.10 వేలు మంజూరైంది. ఆ సొమ్మును జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్ చేతుల మీదుగా మంగళవారం ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యులు శామ్యూల్‌సాగర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శంకర నారాయణ, టి.వేణుగోపాల్, నాయకులు ఆకుల వెంకన్న, రెడ్డి రెడ్డిబాబు, నందికోళ్ల శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మీసాల వెంకన్న రథోత్సవం



పి మల్లవరంలో జరుగుతున్న వెంకన్న రథోత్సవం

తాళ్లరేవు: మండలపరిధిలోని పి.మల్లవరంలో కొలువైన శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి(మీసాల చిన వెంకన్న) కల్యాణ మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారి రథోత్సవం డప్పుల వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.రామారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఉపసర్పంచ్ పంపన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ కమిషన్ సభ్యుడు కిరణ్ తనిఖీలు



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ కిరణ్

అమలాపురం రూరల్: రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ అమలాపురం మండలం గురుకుల బాలికల హాస్టల్‌లో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు భోజనం సక్రమంగా అందుతుందో లేదో అడిగి తెలుసుకున్నారు. అలాగే చిందాడగరువు అంగన్‌వాడీ కేంద్రంతో పాటు స్థానిక ఎండీయూ వాహనాల్ని పరిశీలించారు. ముమ్మిడివరం మున్సిపాలిటీ రేషన్‌షాపులో అవకతవకలు గుర్తించడంతో తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. తనిఖీల్లో జిల్లా సివిల్ సప్లయ్ ఆఫీసర్ పాపారావు, సీడీపీవో కేఎల్‌వీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా మహిళా మార్ట్‌లు

- తక్కువ ధరలకే నిత్యావసర వస్తువుల విక్రయం
- మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు
- సత్ఫలితాలనిస్తున్న ప్రభుత్వ నిర్ణయం



కోరంగిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్



కార్పొరేట్ తరహాలో చేసిన ఏర్పాట్లు

'చేయూత' మహిళా మార్ట్ లోగో

తాళ్లరేవు: పంచదార, బెల్లం, ఉప్పు, పప్పు, బియ్యం, నూనె, వస్త్రాలు, అలంకరణ వస్తువులు, బ్యాగ్‌లు, మ్యాట్‌లు.. ఒక్కటేమిటి ఆ మార్ట్‌లో సమస్త వస్తువులు దొరుకుతాయి. వినియోగదారుల సౌకర్యార్థం సెంట్రల్ ఏసీ, కంప్యూటర్ బిల్లింగ్, వస్తువులు తీసుకెళ్లే ట్రాలీలు, వాహనాల పార్కింగ్ లాంటి సకల సౌకర్యాలుంటాయి. అలాగని అక్కడ ధరలేమి అందనంత ఎత్తులో ఏమీ ఉండవు. బయట మార్కెట్‌తో పోలిస్తే వినియోగదారులకు తక్కువ ధరలకే నిత్యావసర వస్తువులు విక్రయిస్తారు. ఇదేదో మెట్రో పట్టణాల్లో ఏర్పాటుచేసిన కార్పొరేట్ మార్ట్ అనుకుంటే పొరబాటే.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సహకారంతో ఏర్పాటుచేస్తున్న మహిళా మార్ట్‌లో కనిపిస్తున్న పరిస్థితి ఇది..

ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు

చేయూత పథకం ద్వారా వ్యక్తిగత రుణాలిచ్చి జీవనోపాధి కల్పించిన ప్రభుత్వం మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులేయించేందుకు చర్యలు ప్రారంభించింది. దీంట్లో భాగంగానే డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం పర్యవేక్షణలో మండల స్థాయిలో మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేస్తుంది. ఇప్పటికే రాష్ట్రంలో 24 మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేయగా, కాకినాడ జిల్లా కోరంగిలో నాలుగో మహిళా మార్ట్ నెలకొల్పారు. కార్పొరేట్‌కు దీటుగా వినియోగదారులకు తక్కువ ధరలకే సమస్త నిత్యావసరాలు దొరికేలా జాగ్రత్తలు తీసుకోవడంతో మహిళా మార్ట్‌ల్లో కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులను సైతం ఈ మార్ట్‌లో అందుబాటులో ఉంచారు. మహిళా సంఘాల ఆర్థిక పరిపుష్టే ధ్యేయంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ మార్ట్‌లు లాభాల బాటన నడుస్తూ సత్ఫలితాలనిస్తున్నాయి.

సంఘాల బలోపేతమే లక్ష్యం

తాళ్లరేవు మండలం కోరంగిలో సర్వాంగ సుందరంగా ఏర్పాటుచేసిన మహిళా మార్ట్‌ను ఇటీవలే ఇటీవలే జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లు అట్టహాసంగా ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఒక్కొక్కరి నుంచి రూ.200 వాటాధనం సేకరించి రూ.45 లక్షలతో మార్ట్‌ను నిర్మించారు. మార్ట్‌ను ప్రారంభించిన తొలిరోజే సుమారు రూ.3 లక్షల మేర విక్రయాలు జరుపగా, రెండో రోజు రూ.65 వేలు అమ్మకాలు చేశారు. మహిళా సంఘాల నిర్వహణ కష్టసాధ్యమవుతున్న సమయంలో ఈ మార్ట్‌లను ఏర్పాటు చేయడం ద్వారా సంఘాల బలోపేతంతో పాటు మహిళల ఆర్థిక చేయూతకు ఎంతగానో దోహదపడుతుందని డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు.

మహిళా మార్ట్‌లు మైలురాళ్లు



ప్రభుత్వ సహకారంలో ఏర్పాటవుతున్న మహిళా మార్ట్‌లు మండల మహిళా సమాఖ్యకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవనున్నాయి. అంతేకాదు ఏళ్ల తరబడి నడుస్తున్న మహిళా సంఘాల చరిత్రలో మహిళా మార్ట్‌ల ఏర్పాటన్నది మైలురాళ్లుగా నిలిచిపోతాయి. – రెడ్డి సన్యాసిరావు, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం, తాళ్లరేవు

తక్కువ ధరలకే సరకులు



మహిళా మార్ట్‌లో వస్తువులన్నీ బయటి మార్కెట్ కంటే తక్కువ ధరలకు లభిస్తున్నాయి. వ్యాపార రంగంలో సైతం మహిళల సత్తా చాటేందుకు ప్రభుత్వం సహకరించడం మా అదృష్టంగా భావిస్తున్నాం. మహిళల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. – కమిడి ఈశ్వరీబాయి, వీఓఏ, సీతారామపురం

ఆసరాతో మహిళల ఆర్థిక పరిపుష్టి



మహిళలకు మూడో విడత ఆసరా చెక్కుని అందిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీలు ఇజ్రాయిల్, సూర్యనారాయణ



ఆసరా చెక్కును మహిళా సంఘాల ప్రతినిధులకు అందచేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

అల్లవరం: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మహిళలు ఆర్థిక పరిపుష్టిని సాధిస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడోవిడత పంపిణీ కార్యక్రమంలో కోడూరుపాడు పంచాయతీ పరిధిలోని దేశికోడు వంతెన వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు. మళ్లీ కల్లబొల్లి మాటలతో గారడి చేసేందుకు చంద్రబాబు సిద్ధపడుతున్నారని, మహిళలు మోసపోవద్దని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమంటే చేతల ప్రభుత్వమని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన వాగ్దానాన్ని తూచా తప్పకుండా పాటిస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా పథకంలో మండలంలోని 1362 సంఘాలకు తొలి విడతగా రూ.11.45 కోట్లు, రెండో విడతలో 1364 సంఘాలకు రూ.11.49 కోట్లు నిధులు పంపిణీ చేశామని తెలిపారు. మూడో విడతలో 1364 సంఘాలకు రూ.11.46 కోట్లు నిధులను డ్వాక్రా సంఘాల పొదుపు ఖాతాలకు జమ కానున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలు నిర్విఘ్నంగా అమలు కావాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించాలని అన్నారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనతో మహిళలకు అగ్రస్థానం కేటాయిస్తున్నారని, వైఎస్ జగన్‌ని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం గతంలో ఎన్నడూ లేనన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అనంతరం డ్వాక్రా సంఘాలకు మూడో విడత చెక్కుని మంత్రి విశ్వరూప్ చేతుల మీదుగా అందజేశారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, మండల నోడల్ అధికారి జి.సరోవరరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి వెంకటరామరాజు, వైస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల వెంకట రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, మాజీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను, పినిపే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని గెలిపించే బాధ్యత మహిళలదే

కాట్రేనికోన: రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి అండగా నిలిచి ఓటు వేసి గెలిపించాల్సిన బాధ్యత మహిళలపై ఉందని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. కాట్రేనికోనలో బుధవారం మండల మహిళా సమాఖ్య ఏపీఎం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మూడో విడత ఆసరా కార్యక్రమానికి ఎమ్మెల్యే పొన్నాడ ముఖ్య అతిథిగా విచ్చేశారు. మండలంలోని 1351 గ్రూపులకు రూ.8,98,39,172 చెక్కును మహిళా సంఘాల ప్రతినిధులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1351 గ్రూపులకు ఆసరా పథకం కింద ఇప్పటివరకూ మూడు ధఫాలుగా రూ.27 కోట్లు అందజేశామన్నారు. కాట్రేనికోన మండలంలో మంచి నీటి ట్యాంకులు, ఇంటింటికీ కుళాయి, ప్రాజెక్టు చెరువులకు రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డా.బీఆర్ అంబేడ్కర్ పేరును జిల్లాకు పెట్టి ఏడాది గడిచిందన్నారు. అనంతరం మహిళా సమాఖ్య సభ్యులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సంసాని నాగేశ్వరరావు, సెంట్రల్ డెల్టా చైర్మన్ ఏడిది చక్రపాణిరావు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, జెడ్పీటీసీ నేలకిషోర్, మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, నడింపల్లి సూరిబాబు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్‌ని పరిశీలించిన ఆర్డీఓ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతరాయుడు

అల్లవరం: పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా రెల్లుగడ్డలో ఏర్పాటుచేసిన అల్లవరం-2 లేఅవుట్‌ని ఆర్డీఓ వసంతరాయుడు మంగళవారం పరిశీలించారు. అల్లవరం పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు రెల్లుగడ్డ రెవెన్యూ పరిధిలో 4 ఎకరాల భూమిని కేటాయించి, 2 ఎకరాలను మట్టితో నింపారు. మట్టిని కప్పాల్సిన మిగిలిన రెండెకరాల్లో త్వరితగతిన ఫిల్లింగ్ పనులు చేపట్టాలని మండల స్థాయి అధికారులను ఆర్డీఓ ఆదేశించారు. ఇప్పటి వరకూ ఫిల్లింగ్ పూర్తయిన జగనన్న లేఅవుట్‌లో రోడ్లు, ప్లాట్లు విభజించి లబ్ధిదారులతో జియో ట్యాగింగ్ చేయాలన్నారు. ఆర్డీఓ వెంట పీఆర్ డీఈ రాజ్‌కుమార్, తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్, ఎంపీడీఓ సరోవర్, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఆర్ఐ దుర్గా శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆరోగ్య సిబ్బంది కాంట్రాక్టు పొడిగింపు

యానాం: కోవిడ్ సమయంలో అత్యవసర సేవలు అందించేందుకు వీలుగా కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించిన 409 మంది హెల్త్ సిబ్బంది సేవలను మరో 90 రోజులు పొడిగిస్తూ పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంగళవారం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్, ఎక్స్‌రే టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్, శానిటరీ వర్కర్స్ తదితర పోస్టుల కాంట్రాక్టును పొడిగిస్తూ ఆరోగ్యకార్యదర్శి ఎ.పునీతమేరీ నోటిఫికేషన్ విడుదల చేశారు.

జిల్లా వాసులకు అత్యాధునిక క్రీడా వసతులు



జిమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

అమలాపురం రూరల్: జిల్లావాసులకు స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో అత్యాధునిక క్రీడా వసతులు కల్పించామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కోనసీమ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో జిమ్, తైక్వాండో, రెజ్లింగ్, క్రికెట్, బాస్కెట్‌బాల్ క్రీడా వసతులను మంత్రి విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింత అత్యాధునికమైన క్రీడా వసతులను కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత నిధుల ద్వారా చేపడతామన్నారు. కోనసీమ జిల్లా ఆవిర్భవించి ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక బాలయోగి స్టేడియంలో ఓఎన్జీసీ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు రూ.40 లక్షలతో జిమ్ నిర్మించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, ఇళ్ల వెంకటేశ్వరరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జేసీ ధ్యానచంద్ర, జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి, డీఆర్ఓ సీహెచ్ సత్తిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ ఉమెన్ ఎక్స్‌పో పరిశీలన

అమలాపురం రూరల్: మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటుచేసిన బిజినెస్ ఉమెన్ ఎక్స్‌పోను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ మంగళవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా ఉత్పత్తుల ద్వారా మహిళా సాధికారత సాధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ ధ్యానచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



పేరూరులో తాగునీటి ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మంగళవారం స్థానిక వైజంక్షన్ వద్ద పేరూరు ఉపసర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ ఏర్పాటుచేసిన వాటర్ ట్యాంకర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉంటూ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యంతో పాటు తాగునీటి వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ప్రతి మనిషికి రోజువారి తలసరి 55 లీటర్ల నీటి నందించే లక్ష్యంతో ఉద్దేశించిన జలజీవన్ మిషన్ ద్వారా మరింత మేర తాగునీటి వసతులు ఒనగూరనున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్ గోపాల్, సర్పంచ్ అరుణ, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరరావు, డాక్టర్ పినిపే శ్రీకాంత్ పాల్గొన్నారు.

వ్యాపారులు సామాజిక సేవలందించాలి

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



కలెక్టర్ హిమాన్షు శుక్లాను సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వ్యాపారులు సామాజిక సేవల్లోనూ ముందుండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ది అసోసియేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఇటీవల ఎన్నికైన నూతన కార్యవర్గానికి స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ సభకు కలెక్టర్ హిమాన్షు శుక్లా, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చాంబర్ నూతన కార్యవర్గాన్ని కలెక్టర్ శుక్లా అభినందించారు. అమలాపురానికి ఆటో నగర్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని చాంబర్ వ్యాపారులు కలెక్టర్‌ను కోరారు. బీవీసీ ఇంజినీరింగ్ విద్యా సంస్థల అధినేత, చాంబర్ గౌరవ అధ్యక్షుడు బోనం కనకయ్య, గౌరవ కార్యదర్శి వంకాయల రాఘవరావులు నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. చాంబర్ అధ్యక్షుడిగా కల్వకొలను తాతాజీ, ప్రధాన కార్యదర్శిగా యెండూరి నాగేశ్వరరావు, కోశాధికారిగా కర్రెళ్ల రమేష్‌బాబు, అదనపు కార్యదర్శి జనిపిరెడ్డి సురేష్, ఉపాధ్యక్షులు కుప్పాల రామకృష్ణ, పచ్చిపులుసు రమేష్, సంయుక్త కార్యదర్శులుగా దండుమేను రూపేష్, ఎస్‌కే ఖ్వాజాబాబు, డైరెక్టర్లుగా కొప్పిశెట్టి మోహనరావు, కల్వకొలను బాబి, మొల్లేటి నాగరాజు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. చాంబర్ తరపున కలెక్టర్‌కు జ్ఞాపికను బహుకరించి సత్కరించారు.

జీవనోపాధి మెరుగుపరచాలి

అమలాపురం రూరల్: ఆహార పరిశ్రమలకు రుణాలందించి యూనిట్లు నెలకొల్పుతూ పేద వర్గాల జీవనోపాధి మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా స్థాయి ఉద్యాన కమిటీ సమావేశం ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అంశంపై నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార సంబంధమైన పరిశ్రమలకు 35 శాతం సబ్సిడీ అందుతుందన్నారు. జిల్లాకు ఫిష్ ఆంధ్ర కింద 216, ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా మరో 51 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. వాటి ఏర్పాటుపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, ఎల్‌డీఎం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ అభినందనలు



సైన్స్ ఉపాధ్యాయుడు హేమ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న డీఈఓ కమలకుమారి

కాట్రేనికోన: జాతీయ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షల్లో కాట్రేనికోన జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు ఎంపికైన విషయం తెలిసిందే. విద్యార్థులకు శిక్షణనిచ్చిన సైన్సు ఉపాధ్యాయుడు లంకే హేమ శ్రీనివాస్‌తో పాటు ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకటేశ్వరరావును డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఈఓ కమలకుమారి అభినందించారు.

ఘనంగా గంగమ్మ తల్లి జాతర

ముమ్మిడివరం: మండలంలోని అన్నంపల్లిలో యాదవుల కుల దేవతైన గంగమ్మ తల్లి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాజా భజంత్రీలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మూడు రోజుల పాటు జాతర తీర్థ మహోత్సవాలు నిర్వహించనున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

యల్లారమ్మకు విశేష పూజలు



గొల్లవిల్లి యల్లారమ్మ ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలో ఉన్న గ్రామదేవత యల్లారమ్మ అమ్మవారి 115వ వార్షికోత్సవం పురస్కరించుకొని అమ్మవారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి జాతర సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తుల కోసం అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు వైఎస్సార్ ఆసరా రుణమాఫీ కార్యక్రమం

అమలాపురం టౌన్: పట్టణ పరిధిలోని డ్వాక్రా మహిళలకు అమలు చేసిన వైఎస్సార్ ఆసరా డ్వాక్రా రుణమాఫీ కార్యక్రమం స్థానిక బాలయోగి స్టేడియంలో బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

ఆ ఆవులకు చెత్తే మేత



అమలాపురంలో రోడ్డు పక్కనున్న చెత్త కుప్పలో మేత మేస్తున్న ఆవు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో సంచరించే ఆవులకు రోడ్ల చెంత పడి ఉన్న చెత్తే మేతవుతోంది. యాజమానులు పాలు పిండేసుకున్నాక ఆవుల్ని రోడ్లపైకి వదిలేస్తున్నారు. రాత్రి సమయాల్లో రోడ్లపైనే పడుకునే ఆవుల వల్ల ప్రమాదాలు జరిగి ఎందరో క్షతగాత్రులవుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు చర్యలకు పూనుకున్నా కొన్ని సంఘాల ప్రతినిధులు అడ్డుకోవడం పరిపాటిగా మారింది. అందరి నిర్లక్ష్యం వెరసి పట్టణ ప్రజలకు శాపంగా మారుతోంది.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు నగదు అందజేస్తున్న ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జయనాథ్ తదితరులు

అమలాపురం రూరల్: బండారులంక పేరివారి కాలనీ అగ్ని ప్రమాద బాధితులకు జాతీయ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కాశిన జయనాథ్, రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు కొండా భాస్కరరావు చేతుల మీదుగా రూ.20 వేలు ఆర్థిక సాయం మంగళవారం అందచేశారు. కార్యక్రమంలో అల్లాడ భాస్కరరావు, పిచ్చిక చిన్నా, సాయి షణ్ముఖ, చింతా ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం కొత్తలంకలో పేకాట శిబిరంపై ఎస్ఐ కె.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ఆకస్మికంగా దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.17 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

విద్యతో పాటు ఆటలకు ప్రాధాన్యమివ్వాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

యానాం: పాఠశాలల్లో విద్యతో పాటు ఆటపాటలకు సైతం సమప్రాధాన్యమివ్వాల్సిన ఆవశ్యకత ఉందని ప్రధానోపాధ్యాయుడు బొంతు సత్యశ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక దొమ్మేటిపేట ఇసుకకాలువ గ్రామంలోని సర్‌ఆర్థర్ కాటన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వార్షిక క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు ఆడటం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొందుతారన్నారు. అనంతరం వివిధ క్రీడాంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.